క్లుప్తంగా

ఘనంగా ఇఫ్తార్ విందు



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం లో గల మసీదు ఆవరణలో ఇఫ్తార్ ముగింపును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి అభినందన



కొడవలూరు: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయిని ఇంటర్వ్యూకు స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మీభవాని హాజరై పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌ను పొందారు. ఈ క్రమంలో ఆమెకు రూ.10 వేల విలువైన పుస్తకాలను కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నేషనల్ బుక్స్ ట్రస్ట్ ఇండియా ద్వారా పంపారు. వీటిని కొడవలూరులోని పాఠశాలలో ఉపాధ్యాయురాలికి ఎంఈఓ వసంతకుమారి అందజేసి శుక్రవారం అభినందించారు.

కమ్మేసిన మంచు దుప్పటి



పొదలకూరు: ఓవైపు అధిక ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్నారు. మరోవైపు పొగమంచు కనువిందు చేసింది. శుక్రవారం ఉదయం పొదలకూరులో ఏడు గంటలకు కూడా పొగమంచు తగ్గకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

మద్యం షాపులు సమయపాలన పాటించాలి

కోవూరు: కోవూరు ఎక్సైజ్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల్లో గల మద్యం షాపులు సమయపాలనను పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కిశోర్ పేర్కొన్నారు. ఈ మేరకు విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. బెల్టు షాపులను నిర్వహించినా, గంజాయిని విక్రయించినా తమకు తెలియజేయాలని కోరారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న 55 మందిపై ఇప్పటి వరకు కేసులు నమోదు చేశామని వివరించారు.

గండికోట సుధీర్‌కు సత్కారం

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్‌ను మద్రాస్ యూనివర్సిటీ, చెన్నై తెలుగు శాఖ శుక్రవారం సత్కరించింది. ఉగాది వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చేసిన సేవలను కొనియాడి తెలుగు శాఖ అధ్యక్షుడు శంకర్‌రావు, మధురై కామరాజ్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకటరమణ, తమిళనాడు సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు తమ్మినేని బాబు, కవి కాసుల నాగభూషణం తదితరులు సన్మానించారు.

రుణాలివ్వకపోవడం దారుణం



తహసీల్దార్ కార్యాలయ ఎదుట ధర్నా

బుచ్చిరెడ్డిపాళెం: ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా దళితులు, గిరిజనులకు రుణాలివ్వకపోవడం దారుణమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి ఆరోపించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఎదుట ధర్నాను శుక్రవారం చేపట్టి, డీటీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితులు, గిరిజనులకు బ్యాంక్‌ల ద్వారా సబ్సిడీ రుణాలివ్వకపోవడం అన్యాయమన్నారు. దీంతో వారు బయట అప్పులు చేసి ఆర్థికంగా చితికిపోతున్నారని చెప్పారు. బుచ్చి బహుజన సేవా సమితి నేత పాముల రాఘవయ్య, తిరుపతయ్య, మేకల రమణయ్య, వెంకటస్వామి, నరసయ్య, మస్తానయ్య, మాలమహానాడు ఉపాధ్యక్షుడు నాళం పెంచలయ్య, యేసుదాసు, మున్నా, రమణయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన లక్ష్మీ నృసింహుడి ఆలయంలో హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. 80 రోజులకు గానూ ప్రధాన హుండీల ద్వారా రూ.7,16,137, కొండి కాసుల హుండీ ద్వారా రూ.54,701, అన్నదాన హుండీ ద్వారా రూ.20,390 మొత్తాన్ని భక్తులు సమర్పించారని ఈఓ గోపీ తెలిపారు. బంగారం 248.500 గ్రాములు, వెండి 869 గ్రాములను సమర్పించారని వివరించారు.

నిబంధనలకు తిలోదకాలు

- మినరల్ వాటర్ ప్లాంట్లలో ఇదీ తీరు
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వైనం
- ప్రజారోగ్యంతో చెలగాటం



నార్తురాజుపాళెంలోని ఓ వాటర్ ప్లాంట్

కొడవలూరు: ప్రస్తుత తరుణంలో ఫంక్షన్ హాళ్లు.. రోడ్ల వెంబడి ఉన్న చిన్న టిఫిన్ సెంటర్ల మొదలుకొని రెస్టారెంట్ల వరకు మినరల్ వాటర్ హవానే నడుస్తోంది. ఇవి మన ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయనే భావనతో అమాంతం తాగేస్తున్నారు. అయితే ఇవి మంచివా.. కాదాననే ఆలోచనను ఎవరూ చేయడం లేదు. ఫలితంగా అనారోగ్యాలకు గురవుతున్నారు.

పేరులోనే మినరల్.. అంతా జనరల్

చిన్న గ్రామాల మొదలుకొని పట్టణాల వరకు అందరూ తాగుతోంది మినరల్ వాటర్ పేరిట విక్రయమవుతున్న క్యాన్ల నీటినే. వీటి పేరులోనే మినరల్ ఉంటుందే తప్ప నీటిలో ఉండదు. ప్రజల అవసరం కొంత మంది వ్యాపారులకు కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. పెద్దగా పెట్టుబడి లేకుండా తక్కువ వ్యవధిలోనే భారీగా సంపాదించే వ్యాపారంగా మారింది. దీంతో వాటర్ ప్లాంట్లు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. అయితే ఇందులో కనీస ప్రమాణాలు కరువవుతున్నాయి.

మేమింతే..

ఏ ప్లాంట్‌కూ ఐఎస్ఐ అనుమతి ఉండటం లేదు. నిబంధనల మేరకు దీన్ని పొందాలంటే ఏటా రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. దీనికి తోడు ప్రతి నెలా ప్రభుత్వానికి చెందిన ల్యాబ్‌లో వాటర్ టెస్ట్ చేయించాల్సి ఉంటుంది. వాటర్ ప్లాంట్‌లో ఆర్వో మెషినరీతో పాటు ఇతర వాటిని పరీక్షించాల్సి ఉంటుంది. అయితే వీటిని నిర్వహించేందుకు రెండు రోజుల సమయం పడుతుంది. దీంతో కొందరు వ్యాపారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు.

అంతా మోసమే..

కోవూరు నియోజకవర్గంలో అనుమతుల్లేని వాటర్ ప్లాంట్లు దాదాపు 100 ఉన్నాయని అంచనా. లూజుగా విక్రయిస్తే లీటర్‌కు రూ.నాలుగు తీసుకుంటున్నారు. అదే ప్లాంట్ వద్దకే క్యాన్ తీసుకెళ్తే రూ.పది, ఇంటి వద్దకే వచ్చి నింపితే రూ.15 వసూలు చేస్తున్నారు. కూలింగ్ క్యాన్ వాటరైతే ప్లాంట్‌కు వెళ్తే రూ.20, ఇంటి వద్దకొచ్చి ఇస్తే రూ.30 తీసుకుంటున్నారు. వీరిలో కొందరు కనీస నాణ్యత ప్రమాణాలను పాటించడంలేదు.

నేరుగా నీళ్లు పట్టి విక్రయిస్తున్నారు

కొందరైతే ఎలాంటి ప్రాసెసింగ్ చేయకుండా నీటిని క్యాన్లలో నింపి విక్రయించేస్తున్నారు. మంచినీటి బోర్లు వేసుకొని వాటి ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నింపి అదే నీటిని క్యాన్లలో నింపి అమ్ముతున్నారు. ఎక్కడ చూసినా ట్రక్కు ఆటోల్లో క్యాన్లను తరలించడం పరిపాటిగా మారింది. బోరు నీటిని ఎలాంటి శుద్ధి చేయకుండా క్యాన్లలో నింపి నిల్వ ఉంచితే బ్యాక్టీరియా, ఫంగస్ పడుతుంది. అయితే వ్యాపారులకు ఇవేవీ పట్టడంలేదు.

ప్రభుత్వ ప్లాంట్లకు నిర్వహణ గ్రహణం

గతంలో వాటర్ ప్లాంట్లను ప్రభుత్వం విరివిగా ఏర్పాటు చేసింది. కొద్ది రోజులు సజావుగా నిర్వహించి ఆ తర్వాత విస్మరించారు. ఫలితంగా ఇవి నిరుపయోగమయ్యాయి. నార్తురాజుపాళెం, కొడవలూరు, కోవూరు తదితర ప్రాంతాల్లో నిరుపయోగమైన ప్లాంట్లు దర్శనమిస్తున్నాయి. వీటి నిర్వహణ సక్రమంగా ఉంటే ప్రైవేట్ ప్లాంట్లలోని సురక్షితం కాని నీటిని తాగాల్సిన అవసరమే ఉండదు. మరోవైపు నాణ్యత ప్రమాణాలను పాటించకుండా విక్రయాలు సాగిస్తున్న వారిపై అధికారుల తనిఖీలు కరువయ్యాయి.



ట్రక్కు ఆటోలో తరలుతున్న క్యాన్లు

అనారోగ్యాలకు మూలం



ఎలాంటి ప్రాసెస్ చేయకుండా ఉండే నీటిని తాగడం అనారోగ్యాలకు మూలం. శుద్ధి చేయని నీటిని క్యాన్లలో నిల్వ ఉంచితే బ్యాక్టీరియా చేరి అనారోగ్య సమస్యలొస్తాయి. బ్యాక్టీరియా పోవాలంటే క్లోరిన్, ఇతర ప్రక్రియ ద్వారా ప్రాసెస్ చేయాల్సి ఉంటుంది. తాగునీరు సురక్షితమని నిర్ధారించుకున్నాక తాగడమే శ్రేయస్కరం. ప్రస్తుత పరిస్థితుల్లో కాచి చల్లార్చిన నీటిని తాగడం ఆరోగ్యకరం.

– బాలచంద్రబాబు, వైద్యాధికారి, కొడవలూరు పీహెచ్‌సీ

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న ఓఅండ్ఎం హెడ్ సునీల్‌కుమార్ గుప్తా

ముత్తుకూరు: విశాఖపట్నంలో నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీ ఏపీ ఇండస్ట్రియల్ సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డు – 2024 వేడుకల్లో ఎస్ఈఐఎల్ ఎనర్జీకి పారిశ్రామిక భద్రతా నాయకత్వ అవార్డు లభించింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంస్థ సీఈఓ రాఘవ్ త్రివేది వివరాలు వెల్లడించారు. ఉన్నత భద్రతా ప్రమాణాలు పాటించడంలో రాజీపడేది లేదన్నారు. సేఫ్టీ హెడ్ జ్ఞానదేశికన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగానికి మహర్దశ



మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

కొడవలూరు: సహకార రంగానికి ఇక మహర్దశ రానుందని క్రిబ్‌కో సేల్స్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గండవరం సొసైటీలో రైతులతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. గుజరాత్‌లోని మొట్టమొదటి జాతీయ సహకార విశ్వవిద్యాలయాన్ని త్రిభువన్ సహకారి విశ్వవిద్యాలయంగా మారుస్తూ లోక్‌సభలో బిల్లును ఆమోదించారని చెప్పారు. సహకార ఫైనాన్స్, గ్రామీణ క్రెడిట్, మార్కెటింగ్, పాడి, మత్స్య, సహకార తదితర రంగాల్లో ఈ వర్సిటీ శిక్షణ, పరిశోధనలను అందించనుందని చెప్పారు. సొసైటీ సీఈఓ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



వాల్‌పోస్టర్ల ప్రదర్శన

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో శుక్రవారం శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. యాప్ ఉపయోగాల గురించి నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, వర్సిటీ ప్రిన్సిపల్ సీహెచ్ విజయ విద్యార్థినులకు వివరించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ హనుమారెడ్డి, శక్తి టీమ్ ఏఎస్సై సుబ్బరాజు, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్రకు ఎలక్ట్రిక్ వాహనాల విరాళం



వాహనాలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

వెంకటాచలం: సామాజిక బాధ్యతలో భాగంగా వాఘ్ బక్రీ కార్పొరేట్ సంస్థ వెంకటాచలం గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్దనున్న అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు నాలుగు ఎలక్ట్రిక్ వాహనాలను శుక్రవారం విరాళంగా అందజేసింది. వాటిని ఆ సంస్థ సామాజిక విభాగం అధిపతి అజయ్ సిసిలియా, దక్షిణ విభాగం అధిపతి పీవీ సురేష్, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధి ప్రేమ్ భక్తిదాస తదితరులు ప్రారంభించారు. ఈ వాహనాల ద్వారా వివిధ ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తామని ఫౌండేషన్ ప్రతినిధి ప్రేమ్ భక్తిదాస తెలిపారు.

భూములను ఏపీఐఐసీకి అప్పగించరాదు



మాట్లాడుతున్న నేతలు

కోవూరు: షుగర్ ఫ్యాక్టరీ భూములను ఏపీఐఐసీకి అప్పగించి రైతులను మోసం చేయడం తగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని మందబైలు సెంటర్‌లో గల సీతాపోలయ్య భవనంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని ఎన్నికలకు ముందు టీడీపీ హామీ ఇచ్చిందని, అయితే విలువైన భూములను కార్పొరేట్లకు కేటాయిస్తామని ప్రస్తుతం చెప్పడం దారుణమన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా చెరకును పండించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, నిధులను కేటాయించాలని కోరారు. కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముత్యాల గురునాథం, గండవరపు శ్రీనివాసులు, గోనె దయాకర్, పులిగండ్ల శ్రీరాములు, గండవరం శేషయ్య, పెద్దబ్బాయి, బాబు, అఫ్రోజ్ అహ్మద్, ప్రభాకర్, సురేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షకు 9 మంది గైర్హాజరు

ముత్తుకూరు: మండలంలోని నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈఓ మధుసూదన ఒక ప్రకటనలో తెలిపారు. బయోలాజికల్ సైన్స్ ఎగ్జామ్‌కు 692 మంది విద్యార్థులకు గానూ 683 మంది హాజరయ్యారని వెల్లడించారు.

వీవర్స్ విభాగ జనరల్ సెక్రటరీగా కోనం

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ వీవర్స్ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరుకు చెందిన కోనం చిన బ్రహ్మయ్య నియమితులయ్యారు. ఈయన పొదలకూరు సర్పంచ్‌గా, ఎంపీపీగా గతంలో బాధ్యతలు నిర్వహించారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కోనం ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. ఈయన నియామకంపై పలువురు చేనేత కార్మిక నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాచలం: రసాయన మందులు స్ప్రే చేస్తూ.. అస్వస్థతకు గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన పాశం శీనయ్య (42) గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్దనున్న ఎఫ్‌సీఐ గోదాముల్లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈనెల 26వ తేదీన గోదాముల్లో ఎలుకలు, పందికొక్కులు చేరకుండా, పురుగులు పట్టకుండా మందులను స్ప్రే చేశాడు. ఈ క్రమంలో అతను అస్వస్థతకు గురికావడంతో స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు పంచాయతీల్లో విధులు

తోటపల్లిగూడూరు: నరుకూరు పంచాయతీ కార్యదర్శి ప్రవల్లిక వరిగొండతోపాటు నరుకూరు పంచాయతీలోనూ విధులు నిర్వర్తించాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నరుకూరులో రెగ్యులర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రవల్లిక ఎఫ్ఏసీగా ఉన్న వరిగొండ పంచాయతీకే పరిమితమైందని స్థానికులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో వారంలో మూడురోజులు నరుకూరులో, మరో మూడురోజులు వరిగొండలో విధులు నిర్వర్తించేలా చూడాలని ఎంపీడీఓ కార్యాలయానికి సమాచారమిచ్చారు. ఈ ఆదేశాలను కార్యదర్శికి పంపామని ఎంపీడీఓ వెంకటేశ్వరావు వెల్లడించారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

ఇందుకూరుపేట: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీఓ నాగేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రసన్న ఆదాలకు కృతజ్ఞతలు





ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగ అధికార ప్రతినిధిగా నియమితులైన బట్టేపాటి నరేంద్రరెడ్డి పలువుర్ని శుక్రవారం కలిసి కృతజ్ఞతలను తెలియజేశారు. మాజీ మంత్రులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, పార్టీ కోవూరు నియోజవర్గ ఇంటలెక్చువల్స్ ఫోరమ్ విభాగాధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, నేతలు రూప్‌కుమార్‌రెడ్డి, షబ్బీర్, దిలీప్, సుమంత్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా శుక్రవారం సాగింది. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తొలుత బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత సంవత్సర ప్రారంభ నిల్వ రూ.4,94,73,022తో కలుపుకొని రాబడి కింద వచ్చే రూ.17,93,49,000తో కలిపి మొత్తం ఆదాయంగా రూ.22,88,22,022ను చూపారు. మూలధన ఖర్చుల కింద రూ.17,25,19,000 అవుతుందని, మిగులు రూ.5,63,3,022 ఉంటుందని అంచనాను ప్రవేశపెట్టారు. దీనికి ఆమోదం తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. దీంతో పాటు మరో 13 అంశాలపై తీర్మానం చేశారు.

నీటి సరఫరా వేళలను ఎలా మారుస్తారు..?

నీటి సరఫరా వేళలను మార్చే అధికారం మీకెవరిచ్చారంటూ కమిషనర్ బాలకృష్ణను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ షాహుల్ ప్రశ్నించారు. నీరు సమృద్ధిగా ఉన్నా, వీధి కుళాయిల ద్వారా వృథాగా పోతోందని, దీంతో కరెంట్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని కమిషనర్ తెలిపారు. సభ్యులు ఆమోదిస్తే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

మార్కెట్ నిర్మాణంపై రగడ

బుచ్చిరెడ్డిపాళెంలో నిర్మిస్తున్న మార్కెట్‌పై రగడ రేగింది. నగర పంచాయతీకి చెందిన స్థలంలో ప్రైవేట్ వ్యక్తులైన తేజ డెవలపర్స్ ఏ ప్రాతిపదికన నిర్మిస్తున్నారని, అసలు ఒప్పంద పత్రాలేమైనా ఉన్నాయానని నిలదీశారు. మార్కెట్ నిర్మాణం అత్యంత నాసిరకంగా ఉందని షాహుల్ ఆరోపించారు. పాత గోడలకు సిమెంట్ పూసే నిర్మాణం ఏమిటని మండిపడ్డారు. తేజ డెవలపర్స్‌తో నగర పంచాయతీకి ఎలాంటి ఒప్పందాల్లేవని, ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు నిర్మిస్తామన్నారని, ఈ ఆస్తి నగర పంచాయతీకే చెందుతుందని కమిషనర్ బదులిచ్చారు. నాసిరకంగా పనులు చేస్తే పరిశీలిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి మంజూరైన రూ.రెండు కోట్లు ఏమయ్యాయని నిలదీశారు. అసలు తమ పదవీ కాలం పూర్తయ్యేలోపు కొత్త భవనం ప్రారంభమవుతుందానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. దీన్ని పూర్తి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. రానున్న తిరునాళ్లకు సంబంధించిన వేలం పాటలు, పార్కు వద్ద ఉన్న రెండు వాణిజ్య సముదాయాలకు టెండర్లను ఖరారు చేస్తామన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ముత్తుకూరు: ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా మత్స్య కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న బీఎఫ్ఎస్సీ విద్యార్థులు మండలంలోని మల్లూరులో స్కూల్ పిల్లలకు శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. వీటిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ ప్రారంభించి మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమేనన్నారు. అనంతరం గ్రామస్తులచే మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఈ ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ త్రివేణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

చురుగ్గా వరి పంటకోత ప్రయోగాలు



మాట్లాడుతున్న రాంప్రసాద్

తోటపల్లిగూడూరు: మండలంలో వరి పంటకోత ప్రయోగాలు చురుగ్గా సాగుతున్నాయని మండల గణాంకాధికారి రాంప్రసాద్ తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాయంలో శుక్రవారం పంట కోత ప్రయోగాలపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 68 చోట్ల పంట కోత ప్రయోగాలు చేపట్టాల్సి ఉండగా ఇప్పటికే 45 ప్రాంతాల్లో పూర్తి చేయడం జరిగిందన్నారు. దీని వల్ల పంటల బీమా వర్తింపు లాంటి అనేక పరోక్ష ప్రయోజనాలు ఉంటాయన్నారు. వరికోతలు చేపడుతున్న రైతులందరూ పంటకోత ప్రయోగాల నిర్వహణలో వ్యవసాయ శాఖ సహాయకులకు సహకారం అందించాలన్నారు. మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తీరేదెప్పటికో..?



వీఆర్సీ సెంటర్‌లో అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్

- నగర వాసులకు నరకం
- అందుబాటులోకి రాని సిగ్నళ్లు

నెల్లూరు(క్రైమ్): అసలే అంతంతమాత్రంగా రహదారులు.. ఆపై చొచ్చుకొచ్చిన ఆక్రమణలు.. ఎక్కడ పడితే అక్కడే నిలిపేస్తున్న వాహనాలు.. ముందుకు సాగని సిగ్నళ్ల ఏర్పాటు.. వెరసి నగర వాసులు ట్రాఫిక్ టెర్రర్‌తో నానా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నళ్లను పునరుద్ధరించడం ద్వారా సమస్య కొంత మేర పరిష్కారమవుతుందని పోలీసులు, నగరపాలక సంస్థ అధికారులు భావించారు. దీనికి సంబంధించి ఎస్పీటీ నెట్‌వర్క్ సంస్థతో గతేడాది నవంబర్‌లో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఇవి నేటికీ అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

అంతా లోపభూయిష్టం

నగర జనాభా దాదాపు తొమ్మిది లక్షలకు చేరింది. వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగినా, రహదారులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రోడ్లు విస్తరణకు నోచుకోకపోవడం, ఉన్నవి ఆక్రమణలతో కుచించుకుపోతుండటంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. ఆత్మకూరు బస్టాండ్ నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు వాహనాలు బారులుదీరి ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో నగరంలోకి రావాలన్నా.. కార్యాలయాలు, విద్యాసంస్థలకు వెళ్లాలన్నా అరగంట ముందే బయల్దేరాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

మరమ్మతులకు గురై.. మూలనపడి

కొన్నేళ్ల క్రితం రూ.కోట్లు వెచ్చించి ఆత్మకూరు బస్టాండ్, కనకమహల్ సెంటర్, గాంధీబొమ్మ, వీఆర్సీ, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. అయితే సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో అవి మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. ఫలితంగా వాటి ఏర్పాటు ఉద్దేశం నీరుగారింది.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ చర్యలు చేపట్టారు. కనకమహల్ సెంటర్, వీఆర్సీ, ఏసీ కూరగాయల మార్కెట్, రామలింగాపురం, హరనాథపురం జంక్షన్లు, కేవీఆర్ పెట్రోల్ బంక్, జిల్లా పోలీస్ కార్యాలయ కూడళ్లలో రూ.1.39 కోట్లతో రెండు విడతల్లో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన ఎస్పీటీ నెట్‌వర్క్‌తో ఒప్పందం చేసుకున్నారు. అయినా ఇది కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నళ్లను త్వరితగతిన ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.